4546

# నవ్వుల గజ్జెలు

"వేడిగా ఏమేముంది?"

"వడ, దోసె, ఇడ్లీ, పూరీ, బోండా, మైసూరుపాక్" ఏక బిగిని రాము పాఠం వల్లించాడు. బాల్యపు కంఠ మాధుర్యం ఇంకా చెదిరి పోలేదు. వాడి చూపులు ఫామిలీ రూమ్స్ తలుపులకేసి పదే పదే పరుగు లెత్తుతున్నాయి.

"రెండు ప్లేట్లు ఇడ్లీ చట్నీ పట్రా"

రాము వడిగా వంటింటివేపు నడిచాడు. నడుస్తుంటే శరీరంలోని బిగి స్పష్టంగా కనుపిస్తోంది. మధ్యలో అతనికి ఏదో పొరపాటు చేసినట్లు తట్టింది. గిరుక్కున వెనక్కి మళ్ళాడు. ఆ వూపుకి పచ్చటి శరీరంలో రంగు రంగుల ఇంద్ర ధనుస్సు మసిలింది.

నొప్పుల ఒళ్ళు ఎందుకో జిలజిల మంది. చప్పున ఆర్డర్ తీసుకున్న టేబుల్ దగ్గరకు వెళ్ళి "ఇడ్లీ లేదని" సమాధానం చెప్పాడు.

"ఇందాక వున్న దన్నావే?"

ఆర్డర్ యిచ్చిన కుర్రాడు ఆలోచనలో పడ్డాడు.

"అయితే.... రెండు కప్పుల టీ పట్రా"

"రెండు టీ" అని రాము గట్టిగా అరిచాడు. అదుపు వేగంతో వంటింట్లోకి వెళ్ళాడు. వంటింటి కౌంటర్ పైన 'టీ' కనపడక పోవడంతో ఎంతో విసుక్కున్నాడు. కౌంటర్ మీద మోచేతులు ఆనించి, వదులు వదులుగా నిలబడ్డాడు.

కొంతసేపటికి టీ కప్పులు కనపడ్డాయి. వెంటనే అవి అందుకుని దుడుకుగా టేబుల్ దగ్గర కొచ్చాడు. కప్పుల అంచులు ఒరుసుకుని నడకలో టీ సాసర్లలో పడింది. టీ తగిలి, చేతి బొటనవ్రేలు చురుక్కుమంది. చెయ్యి వణికింది. చేతిలోంచి కప్పు జారి ఆర్డరిచ్చిన కుర్రాడు ఒళ్ళో పడింది. అతను దిగ్గున లేచి రామును ఫెళ్ళున చెంపమీద కొట్టాడు. ఆ దెబ్బకి రెండవ కప్పు, ఎడమచేతి సాసర్లోంచి దొర్లి టేబుల్ పైన ముక్కలు ముక్కలైంది. టీ నాలుగు వేపులా చిమ్మింది. కొంత తనపైన పడేసరికి రాముకి మెళకువ వచ్చింది. పాముకి మల్లే 'టీ' టేబులు పైన పాకి అంచుల్ని ఒరుసుకొని, రాము కాలి బొటన వ్రేలిపై పడింది. చెంప చురుకుతో కాలి చురుకు పెనవేసుకుంది. రాము శరీరంపైన పడగలు విప్పి, పాములు, జెర్రులు పాకాయి. ఒళ్ళు జిల జిల మని ఉప్పొంగింది. నరాలు బిగుసుకు పోయినాయి. మనసులో కోపం లేదు. కాని ఏదో ఒళ్ళు తెలియని ఉద్రేకం పొంగి రాము ఆర్డర్ యిచ్చిన కుర్రాడిని, ఫెళ్ళున కొట్టాడు. చెంప బుర బుర పొంగింది....రాము కళ్ళు మిణుగుర్లు కక్కాయి... ఉత్తర క్షణంలో జెర్రులు పాకడం మానుకున్నాయి... నరాల బిగువు సడలి, ప్రశాంతత ఆవరించింది. హోటలులోని మనుషులు ఈ సంఘటనకి ఏక కంఠంతో గొల్లుమన్నారు. కౌంటర్ మీది యజమాని తిట్ల వర్షంతో లేచాడు. దెబ్బలతో, తన్నులతో రాముని హోటల్లోనుంచి తరిమాడు. రాము గుడ్డల్ని అతనిపై గిరాటు వేశాడు. రాముకి ఎందుకో యజమానిపై తిరగబడదామన్న వాంఛే కలగలేదు. నరాలన్నీ సడలి ఒక విధమైన ఆనందం కమ్మింది.

ఎందుకో శరీరం తడిబట్టకు మల్లే బిగుసుకు పోయింది. కళ్ళ ముందు నగ్నంగా రోడ్డు పరుచుకొని వుంది. బరువుగా అడుగులు వేస్తూ రాము ముందుకు సాగాడు. హోటలులోని గోల క్రమంగా తగ్గి శరీరాన్ని తేలిక పరచింది. కొంతదూరం అనాలోచితంగా నడిచాడు. కాళ్ళు ఎందుకో పీక్కు పోతు న్నాయి. ఎక్కడికి వెళ్ళటానికి తోచలేదు. కొద్దిగా ఆకలని పించింది. ఆకలిని దులి పేసుకుని, రోడ్డు ప్రక్కనున్న మైదానంలో గుమిగూడిన ఒక గుంపులోకి వెళ్ళాడు. గుంపుని చీల్చి మధ్యకు వెళ్ళడంలో, తనకు రెండంతలు పొడుగున్న మనిషి కాలు తొక్కాడు. "తిప్పి కొడితే మోకాలంత లేవు, కాలు తొక్కుతావా వెధవా?" అని అతను కస్సున లేచాడు. అంతకుముందే జరిగిన హోటలు సంగతి జ్ఞాపకం వచ్చి, రాము పిల్లికిమల్లే ముందుకు వెళ్ళి మొదటి వరుసలో కూర్చున్నాడు. అక్కడ మొగ కోతి, ఆడ కోతిని బతిమాలుతున్నది. ఆడ కోతి తల్లిగా రింటికి వెడతానని మగ కోతిని భయపెట్టుతున్నది. మగ కోతి దగ్గరకు వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నది. తల నిమరడానికి చూస్తోంది. ఆడకోతి గుర్రుమంటున్నది. ఆ కోతుల్ని చూస్తే నవ్వు వచ్చింది కాని, వాటి ఆలు మగల భాగోతం రాముని ఎందుకో 'కలత' పెట్టింది. అతనికి ఆడ కోతి తల నిమురా లనిపించింది. దిగ్గున లేచి రాము ఆడ కోతి వేపు వెళ్ళాడు. కోతు లాడించేవాడు రాముని చూచి "అరే కుర్రాడా, కూర్చో" అని గద్దించాడు. రాముకి ఎందుకో కోతులవాడు ఆడ కోతిని నిమురుదామని లేచిన తనని 'కుర్రా' డనటం వెగటుగా తోచింది. ఆ మాటతో ఉత్సాహం చచ్చింది.

వెనక్కి వెళ్ళి తన మొదటి చోటుకి వచ్చి కూర్చున్నాడు. మగ కోతి ఆడ కోతిని బతిమిలాడి బతిమిలాడి విసుగెత్తింది. అంత బతిమిలాడించుకోవడం చూచి రాముకి ఆడ కోతిపైన కోపం వచ్చింది. ఇంతలో మగకోతి కర్ర తీసికొని, ఆడ కోతి వెంట పడింది. ఆడ కోతి కోతు లాడించేవాడి చుట్టూ దొరక కుండా పరుగెత్తుతున్నది. వాడిచుట్టూ ... అది అలా తిరుగు తుంటే, వాడిపైనా ఆ కోతిపైనా కోపం మరింత ఎక్కు వైంది. మొగ కోతి వేగం హెచ్చింది. త్వరగా ఆడ కోతిని సమీపించి, రెండు బాదింది. ఆడ కోతి కీచు కీచులాడింది. మొగ కోతి చెప్పినట్లల్లా అది వినడం మొదలు పెట్టింది. రాముకి ఎందుకో ఆడ కోతిని మక్కలు విరగదన్నాలని ఆ తర్వాత తల నిమురాలని అనిపించింది. ఆట ముగిసింది. కోతు లాడించేవాడు డబ్బులు అడుక్కుంటున్నాడు. రాము అక్కడ నుంచి లేచి, తిరిగి నడక సాగించాడు. రోడ్డుపైన ఒక జంట చిరునవ్వులతో ముందుకు సాగింది. రాము తన కళ్ళని ఆ జంటకి అప్పగించాడు. జంట మూలమలుపు దాటింది. రాము తన కళ్ళని రోడ్డుపైకి మళ్ళించాడు. పర్దాతో ఒక రిక్షా ఎదురుగా వచ్చి, రాముని దాటేసి వెళ్ళింది. రాము కళ్ళు ఆ పర్దాని చీల్చడానికి ప్రయత్నించాయి. రోడ్డుప్రక్కన ఆగిన కారులో నలుగురు యువకుల మధ్య నుంచి ఒక అమ్మాయి నవ్వు గలగల మంది. ఆ రవళిలో రాముచూపులు లీనమైనాయి. ఒక అమ్మాయి గాలికిఎగురుతున్న కొంగుతో, సైకిలు పైన రాముని దాటేసి వెళ్లింది. రాము చూపులు చక్రాల వేగంలో ఇరుక్కొని పోయినాయి. ఎందుకో రాముకి ఆ సైకిలుని నిలుచున్న పాటున పడగొట్టాలనిపించింది.

రాము సైకిలు మళ్లిన సందులోకి వెళ్ళాడు. సైకిలు కనబడ లేదు. ఏదో పోగొట్టుకున్న వాడికిమల్లే సందును ఒక్కసారి దిగులుగా కలియ జూసాడు. సందులో చీకట్లు అలుముకొం టున్నాయి. కళ్ళముందు మసక తెరల్ని ముంచుతున్నాయి. చీకట్లల్లోకి వెళ్ళడానికి అతని మనస్సు ఒప్పుకోలేదు. తిరిగి హోటలుకు వెడితే బాగుండు ననిపించింది. కాని తనని నిలు చున్న పాటున తరిమివేసిన యజమాని తనకి ఆశ్రయ మిస్తా డన్న నమ్మకం లేదు. తనకు ఎక్కడా తల దాచుకోవడానికి చోటు లేదన్న తలపుతో రాముకి ఎంతో భయం వేసింది. ఆకలి వేస్తున్నది. తినడానికి ఏమైనా దొరికితే బాగుండు ననిపించింది. పోనీ చొక్కాలు అమ్ముకుంటే? చిరిగిన చొక్కాలు ఎవ్వరూ తీసుకోరనే అధైర్యం వెంటనే రాముకి కలిగింది. బిచ్చమెత్తుకుంటే? హోటలు ముందు రోజూ బిచ్చ మెత్తుకునే బిచ్చగాళ్ళ దురవస్థ అతనికి జ్ఞాపకం వచ్చింది.

వెళ్ళగొట్టేముందు తన యజమాని పనిచేసిన రోజులకు జీతమైనా కట్టిస్తే బాగుండేది. తన గ తేమీ ఆలోచించకుండా నిర్దాక్షిణ్యంగా వెళ్ళగొట్టాడు. తాను రెండు సంవత్సరాలు చేసిన చాకిరీ అయినా అతనికి గుర్తుకురాలేదు. ఎన్నడూ లేనిది, ఈ మధ్యనే తనకు తాను ఎన్నోసార్లు హోటల్‌లో తిరగబడటం జరిగింది. ఎందుకో ఈ మధ్యనే తనకు చిరాకు ఎక్కువైంది. ఎందుకో ఉదయం లేచేసరికల్లా, వళ్లు పచ్చి పుండుగా వుంటుంది, ఎందుకో ఎండలో నిలబడా లనిపిస్తుంది, కెలికి కయ్యం పెట్టుకోవాలని వుంటుంది. ఎవరినైనా కొట్టి, తన్నులు తినాలని కోరిక కలుగుతుంది. ఉద్రేకం పొంగించుకొని ఉపశమించుకోవా లనిపిస్తుంది. పట్నమంతా

ఒకటే పనిగా తిరగాలని వుంటుంది. దీని కంతటికీ కారణ మేమిటో రాముకి ఎంత ఆలోచించినా ఏమీ పాలుపోలేదు. రాముకి ఏమీ తోచక వచ్చినదారి పట్టాడు. అప్పటికే తాను తిరిగిన రోడ్డుపైన దీపాలు పెట్టి వున్నాయి. దీపాల వంక చూస్తూ ముందుకు సాగడం మొదలెట్టాడు. పైన ఆకాశం మబ్బులతో పచ్చిగర్భిణిలా వుంది. వాన వస్తుందన్న భయమేసి, వడివడిగా నడిచాడు. వంద అడుగులు వేశాడో లేదో చినుకులు ప్రారంభమైనాయి. మరికొంత దూరం నడిచే సరికి పెద్దజల్లు వచ్చింది. రాము వెంటనే ఒక కొట్టు చూరు కిందికి చేరుకున్నాడు. చినుకులు పడనిచోట నిలబడ్డాడు. కొట్టు లోని దీపాల వెలుతురులో రకరకాల చీరెలు జిగేలు మంటున్నాయి.

రంగుచీర లన్నింటిని కప్పుకొని, వాటి మెత్తదనాన్ని తాకి ఆనందిస్తూ అక్కడే ఆకొట్టులోనే పడుకోవాలనిపించింది. కాని కొట్టువాడి నల్లని లావుపాటి శరీరం చూచి భయ మేసింది. వర్షం క్షణక్షణానికి ఎక్కువవుతున్నది. వర్షం తుంపరలు తుంపరలుగా రాముపైన పడుతున్నది. కడుపులో ఆకలి కలవరపెడుతున్నది. కాని వాన తెరల్లోంచి వీధిదీపాలు ముచ్చటగా కనబడుతున్నాయి. ఏ హోటల్ కైనా వెళ్ళి తిరిగి సర్వరుగా జేరితే...ఆకలికి కడుపులో ఏదో నులి ప్రారంభ మైంది. అది నిముష నిముషానికి హెచ్చుతున్నది. చీరెల కొట్టువాడు కొట్టు కట్టేసే సన్నాహంలో ఉన్నాడు. దూరాన ఎక్కడో ఒక కుక్క ఏడుస్తున్నది. తనకిమల్లే ఆకలివేసి కాబోలు. కుక్క మోస్తరు ఆకలికి మనిషి ఎందుకు ఏడ్వాడూ? ఏమో...ఎందుకో లోపల లోపల కుళ్ళి బాధపడతాడు.

అయినా ఈ అర్ధరాత్రి ఉద్యోగం ఎవరిస్తారని? రాముకి తిరిగి తన హోటల్‌కి వెళ్ళి, సర్వర్‌ని ఎవరినైనా పట్టెడన్నంకోసం బ్రతిమలాడడం మంచిదనిపించింది. యజమాని రాత్రిపూట హోటల్లోవుండడు. అందువల్ల ఏ సర్వర్ ఐనా కనికరించవచ్చు. కొట్టువాడు కొట్టుమూశాడు. కొట్టు ముందుభాగం గుడ్డి చీకటిలో మునిగింది. కొట్టువాడు కారెక్కి యింటికి వెళ్ళి పోయాడు. వర్షం ఇంకా ఎడ తెరిపిలేకుండా కురుస్తూనేవుంది. మధ్యమధ్య గాలి రివ్వున వీస్తున్నది. చలి ఎక్కువవుతున్నది. రాము చంకలోని చొక్కాలుతీసి, ఒకదానిపైన ఒకటి తొడుక్కున్నాడు. ఇక చంకలో రెండు ధోవతులు మాత్రం మిగిలాయి. ఇంకా చలిగానే ఉంది. రెండు ధోవతులు మడత పెట్టి కప్పుకున్నాడు. వర్షం వెలిసే సూచన ఎక్కడా కనపడ లేదు. రెండుగంట లయింది. ఆకలికి కడుపులో పేగులు అరుస్తున్నాయి. హోటల్‌కి వెళ్ళటం ఆ వానలో అసాధ్య మనిపించింది. వానలో బయలుదేరి, వున్న రెండుబట్టలు తడుపు కోవడానికి రాము మనస్సు ఒప్పుకోలేదు. కొట్టుముందే ఆకలి పడక వేయడానికి నిశ్చయించుకున్నాడు. కప్పుకున్న ధోవతి తీసి కింద పరిచాడు. ఇంతలోకే తడుస్తూ ఒక కుక్కకూన కొట్టు కప్పుకిందికి పరుగెత్తుకొచ్చింది. రాము దాన్ని వెళ్ళ గొట్టే ఉద్దేశంతో దాని కడుపుపైన ఒక తన్ను తన్నాడు. కుంయిమని ఏడుస్తో, అది తనకు ఎదురుగావున్న మూలకి నక్కి పడుకుంది. రాము చేసేదేమీ లేక, తాను పరుచుకొన్న ధోవతిమీద మేనువాల్చాడు. మిగిలిన యింకొక ధోవతి కప్పుకొన్నాడు. ఈదరగాలికి కళ్లు పొడుచుకున్నా నిద్ర రావడంలేదు.